

సిద్దిపేట ఏరియా ఆసుపత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట క్రైం, జూన్ 25: సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి వైద్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు వైద్యవిభాగాల గదులను, వైద్యపరికరాలను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు. అలాగే, రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో అన్నిరకాల అత్యాధునిక వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నందున ప్రజలు ప్రైవేట్‌కు వెళ్లి ఇబ్బందులు పడకుండా ఇక్కడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేబర్‌రూంలో ప్రసవాలు చేయడానికి స్పెషల్ బర్త్ ఛైర్ కావాలని వైద్యులు కోరగా ఏర్పాటు చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యశ్రీ కౌంటర్ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ కిషోర్ కుమార్, ఆర్ ఎం.సదానందం, ఆయా విభాగాల డాక్టర్లు తదితరులు ఉన్నారు.

మహిళాశక్తిని పకడ్బందీగా అమలు చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్ : మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి అమలుపై చర్చించి పలు ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో మహిళా శక్తి పాలసీ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 15,185 యూనిట్లతో 18,788 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి, ఎంఎస్ ద్వారా రూ.189.12 కోట్లతో లబ్ధి చేకూర్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే యూనిట్ల ఎంపిక జరిగేప్పుడు సంబంధిత శాఖల అధికారులతో చర్చించి ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో పీడీ జయదేవ్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జగత్ కుమార్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, ఎల్డీఎం హరిబాబు, జిల్లా వ్యవసాయ అధికారి మహేష్, ఇండస్ట్రీస్ జీఎం గణేష్, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రిజర్వాయర్లలో నీరు అడుగంటడంతో జిల్లాలో సాగుకు నీరందడం కష్టసాధ్యంగా మారింది. జిల్లాలోని చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో రంగనాయక సాగర్, తొగుట మండలం తుక్కాపూర్ వద్ద కొమురవెల్లి మల్లన్నసాగర్, మర్కుక్ మండల కేంద్రంలో కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను ఐదేళ్ల క్రితమే నిర్మించారు. నాలుగేళ్లుగా ఈ రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి కాలువల ద్వారా చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించి పంటల సాగుకు ప్రయోజనం చేకూరుస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, దాని మరమ్మతుల కారణంగా ఈసారి రిజర్వాయర్లలోకి నీటిని ఎత్తిపోయడం అసాధ్యంగానే కనిపిస్తోంది.



రంగనాయకసాగర్ రిజర్వాయర్

వరదొస్తేనే సాగు!

- రిజర్వాయర్లకు ఎత్తిపోత ప్రశ్నార్థకమే
- జాప్యమవుతున్న మేడిగడ్డ మరమ్మతులు
- డెడ్‌స్టోరీజీకి రంగనాయకసాగర్
- మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లు వెలవెల
- సుమారు 2లక్షల ఎకరాల సాగుపై ప్రభావం
- శ్రీరాంసాగర్‌పైనే ఆశలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 25: 3 టీఎంసీల సామర్థ్యంతో రంగనాయకసాగర్, 50 టీఎంసీలతో మల్లన్నసాగర్, 15 టీఎంసీలతో కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం నీటినిల్వ మొత్తంగా 13 టీఎంసీలు మాత్రమే ఉంది. గడిచిన వానాకాలంలో ఎత్తిపోసిన నీటినే ఇప్పటికీ వినియోగిస్తున్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్ మొదటిసారిగా నీళ్లు కరువై డెడ్‌స్టోరేజీకి చేరింది. మిగితా రిజర్వాయర్లలోనూ నీటి సామర్థ్యం అంతంతగానే ఉంది.

ఎత్తిపోయకుంటే ఇబ్బందులే

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా రిజర్వాయర్ల ద్వారా సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందుతోంది. క్షేత్రస్థాయిలో మైనర్, సబ్‌మైనర్ కాలువలు నిర్మించి ఉంటే ఈ సంఖ్య రెట్టింపయ్యేది. కానీ, ప్రధాన కాలువల ద్వారా చెరువులు, కుంటల్లోకి తరలిస్తూ ఆయకట్టుకు ప్రయోజనం కలిగేలా చేశారు. ఫలితంగా వర్షాలు కురవకున్నా బావులు, బోర్లలో సమృద్ధిగా నీళ్లు ఉండేవి. వాగులు, చెక్‌డ్యాంలనూ నిండుగా నింపిన సందర్భాలు ఉన్నాయి. వేసవిలోనూ చెరువులు మత్తళ్లు దూకిన సందర్భాలు నాడు చర్చనీయాంశంగా మారాయి. కానీ, ప్రస్తుతం వర్షాకాలంలో కూడా ఈ రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు, వాగులు వెలవెలబోయి కనిపించడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. రిజర్వాయర్లలో నీళ్లు లేకుంటే సాగు విస్తీర్ణం కూడా తగ్గే అవకాశం లేకపోలేదు.

శ్రీరాంసాగర్‌పైనే ఆశలు

ఇప్పటివరకు కాళేశ్వరం సమీపంలోని మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోస్తూ జిల్లాలోని రిజర్వాయర్ల వరకూ తరలిస్తూ వచ్చారు. అయితే మేడిగడ్డ బ్యారేజీ సమస్యల్లో ఉండడంతో ఎత్తిపోతలకు బ్రేక్‌పడింది. దీంతో ఈ రిజర్వాయర్లు నిండాలంటే శ్రీరాంసాగర్ వరద కాలువపైనే ఆశలు నెలకొన్నాయి. నిజామాబాద్ జిల్లాలో గోదావరి నదిపై ఉన్న శ్రీరాంసాగర్ నిండగా మిగిలిన నీటిని వరద కాలువ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న మిడ్‌మానేరు రిజర్వాయర్‌కు తరలిస్తారు. మిడ్‌మానేరు నుంచి మన జిల్లా సరిహద్దులో ఉన్న అనంతసాగర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తారు. అక్కడి నుండి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటుంది. ఇదంతా జరగాలంటే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన భారీగా వర్షాలు కురవాలి. అప్పుడే వరద పొంగుకొచ్చి మిడ్‌మానేరుకు చేరుతుంది. లేదంటే కూడవెల్లి, మానేరు, మూలవాగులు పొంగిపొర్లినా మిడ్‌మానేరులోకి నీరు చేరుతుంది. 25 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్‌లోకి నీరు చేరినా కొద్దీ జిల్లాలోని రిజర్వాయర్లకు వెనువెంటనే ఎత్తిపోయడం వల్ల వచ్చే వేసవికి కూడా వినియోగించుకునే అవకాశం ఉంది.



కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్

బోసిపోయిన రిజర్వాయర్లు

రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.70 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఈ రిజర్వాయర్ ద్వారా సుమారు 65వేల ఎకరాలకు నీరందించినట్లు అధికారులు చెబుతున్నారు. 3టీఎంసీల పూర్తి నీటి సామర్థ్యం ఉంటేనే ఇది సాధ్యపడుతుంది. ఇక 50 టీఎంసీల సామర్థ్యం ఉన్న మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో కేవలం 8 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాలువల ద్వారా 50 వేల ఎకరాల ఆయకట్టుకు గతంలో నీరందించారు. ప్రస్తుతం 4 టీఎంసీలను నిల్వ ఉంచి మిగితా 4 టీఎంసీలను సాగు, తాగు అవసరాలకు వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న కొండపోచమ్మసాగర్‌లోనూ 4.5 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉండడం రైతులను కలవరపెడుతోంది. ఇందులో నుంచి 2 టీఎంసీలకు మించి వినియోగించుకునే అవకాశం లేదు. నాలుగేళ్లపాటు కళకళలాడిన ఈ రిజర్వాయర్లపై నీలినీడలు కమ్ముకోవడం జిల్లా రైతాంగానికి, ప్రజలకు ఇబ్బందిగా పరిణమించింది.



కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్



సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా)ఆధ్వర్యంలో గతంలో ప్రధాన కూడళ్లయిన వేములవాడ, కరీంనగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన శిల్పాలు, వాటర్ ఫౌంటైన్లు నేడు సరైన నిర్వహణ లేక అంధకారంలో దర్శనమిస్తున్నాయి.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- వైద్యఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్



గట్ల మల్యాల పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నంగునూరు, జూన్ 25: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నంగునూరు మండలం గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. సిబ్బంది సమయం పాలన పాటించాలన్నారు. ప్రతి మంగళవారం మహిళల కోసం నిర్వహించే క్లినిక్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల వారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని, ఫార్మసీ స్టోర్‌ను అలాగే, గట్ల మల్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అంజలి రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుపై నిఘా

- నార్కోటిక్ ప్రత్యేక డాగ్‌తో బ్లాక్‌స్పాట్లలో తనిఖీలు

సిద్దిపేట క్రైం, జూన్ 25 : జిల్లాలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల సరఫరాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. గంజాయిని, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించడానికి ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు అనుమానాస్పద స్థావరాలను గుర్తించి నిఘా ఏర్పాటు చేశారు. సీపీ అనురాధ ప్రతినెలా జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అప్రమత్తం చేస్తున్నారు.

తనిఖీలకు ప్రత్యేక నార్కోటిక్ డాగ్ మెస్సీ

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా హైదరాబాద్ పోలీస్ జాగిలాల శిక్షణ కేంద్రంలో కొన్ని నార్కోటిక్ డాగ్‌లకు గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను గుర్తించే విధంగా శిక్షణ ఇచ్చారు. ప్రతి జిల్లాకు ఒక నార్కోటిక్ డాగ్‌ను పంపించారు. అయితే జిల్లాకు కేటాయించిన నార్కోటిక్ డాగ్ పేరు మెస్సీ వయస్సు 4 సంవత్సరాలు. ఈ డాగ్ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాసనను పసిగడుతుంది. గతంలో ఎక్కడైనా గంజాయి దొరికిన ప్రాంతాలను, ఏ ప్రాంతంలోనైతే ఎక్కువగా గంజాయి తీసుకునే వ్యక్తులు ఉంటారో, గ్రామాల్లో ఉండే బెల్టుషాపులు, దాబాల వద్ద ఉన్న పాన్‌షాప్‌లను బ్లాక్ స్పాట్‌గా గుర్తించి తనిఖీలు చేపడుతున్నారు.



నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేస్తున్నపోలీసులు (ఫైల్)

విడతలవారీగా తనిఖీలు

పోలీసులు ప్రతిరోజు జిల్లాలో ఉన్న ఒక పోలీస్‌స్టేషన్ ఎంచుకుని అనుమానాస్పద స్థావరాల (బ్లాక్ స్పాట్ల) వద్ద నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపడుతున్నారు. సిద్దిపేట వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ రూరల్, చిన్నకోడూరు, బెజ్జంకి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి అనుమానాస్పద స్థావరాల వద్ద తనిఖీలు పూర్తిచేశారు. ఇప్పటివరకు ఎలాంటి గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు దొరకలేదు.

యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దు : సీపీ

- 349 కిలోల గంజాయి కాల్చివేత

చిన్నకోడూరు, జూన్ 25: యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో 2023-24లో నమోదైన 14 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 349 కిలోల గంజాయిని మంగళవారం చిన్నకోడూరు మండలం మాచాపూర్ శివారులోని ధర్మ అండ్ కంపెనీ బయో మెడికల్ వేస్టేజ్ ప్రాసెసింగ్ యూనిట్ ఇన్సులేటర్‌లో డిస్ట్రాయ్ (కాల్చి వేశారు) చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల రహిత జిల్లాగా చేయడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై జిల్లాలో ప్రత్యేక టీమ్స్‌తో నిఘా ఏర్పాటు చేశామని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, ఉపేందర్, శ్రీను, విద్యాసాగర్, శ్రీను, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ఎస్ఐలు బాలకృష్ణ, భాస్కర్ రెడ్డి, మహేష్, తిరుపతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి కాల్చివేతను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

'వాల్టా'కు తూట్లు

- నంగునూరు కేంద్రంగా ఇసుక దందా
- దోపిడీకి గురవుతున్న పెద్దవాగు
- అనుమతులకు మించి రవాణా
- భూగర్భజలాలు తగ్గుముఖం
- తనిఖీలు పట్టని అధికారులు

నంగునూరు, జూన్ 24 : నంగునూరు మండలంలోని పెద్దవాగు (అక్కెనపల్లి మోయతుమ్మెదవాగు)నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ కొందరు ఈ దందా సాగిస్తున్నారు. వాగు పక్కన గల పొలాల నుంచి దారులు ఏర్పాటు చేసుకుని ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తున్నారు. 30 మందికి పైగా కూలీలను ఏర్పాటు చేసుకుని జేసీబీలతో ఇసుక తవ్వి ట్రాక్టర్లలో నింపి సిద్దిపేటతో పాటు చేర్యాల, హుస్నాబాద్, ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను సుమారు రూ.4వేల నుంచి రూ.6వేల చొప్పున విక్రయిస్తున్నారు. నలుగురు ట్రాక్టర్ యజమానులు కలిసి ముందుగా కారులో ఎస్కార్ట్‌గా వెళ్లి పోలీసులు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాతనే ట్రాక్టర్ డ్రైవర్లకు సమాచారం అందిస్తారు. అప్పుడు ట్రాక్టర్లు బయలుదేరి గమ్యస్థానాలకు చేరుతాయి. అయితే అక్కెనపల్లి వాగు ఇసుక అక్రమ తరలింపు సంబంధిత శాఖ అధికారులకు కాసులు కురిపిస్తుందని, ప్రతినెలా అధికారులకు ముడుపుల రూపంలో ఇసుక వ్యాపారులు అందజేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పత్రికల్లో వార్తలు ప్రచురితమైనపుడు నామమాత్రంగా దాడులు చేసి ఓ కేసు నమోదు చేస్తారు. వాహనాలను పట్టుకున్న అధికారుల చేతులు తడపాల్సిందే. లేదంటే వారు ఆ ట్రాక్టర్ యాజమానిపై ప్రత్యేక నిఘా పెట్టి సీజ్ చేస్తారు.

స్థానిక అవసరాల పేరుతో..

మండలంలోని పెద్దవాగులోంచి ఇసుకను స్థానిక గ్రామాల అవసరాలకు వినియోగించవచ్చనే సాకుతో ఇక్కడ ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. రాజకీయ నాయకుల పలుకుబడితో తహసీల్దార్ లేదా ఆర్డీవోల ద్వారా అనుమతులు పొందుతారు. ఆ పత్రాలపై స్పష్టమైన తేదీ లేకుండా అధికారులు జారీ చేస్తారు. ఇదంతా రెవెన్యూ, పోలీసులకు, వ్యాపారులకు మధ్య ఒప్పందం మేరకు జరుగుతుందని కొందరు బహిరంగంగానే చెబుతున్నారు. ఇక ఇదే అదునుగా భావించి వ్యాపారులు తమ ఇష్టానికి ఇసుకను తరలిస్తున్నారు. కొందరు రైతులు వారి పొలాల్లోంచి ట్రాక్టర్లు వెళ్లాలంటే నష్టపరిహారంగా కొంత డబ్బు తీసుకుని వ్యాపారులకు సహకరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.



సిద్దిపేటకు ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం



ఇసుక తరలింపుతో వట్టిపోయి పెద్దవాగులో మొలుస్తున్న గడి

నంగునూరు చుట్టూరా ఇసుక డంపులే..

ఇసుక రవాణాకు అడ్డాగా మారిన నంగునూరు చుట్టూరా ఎటుచూసినా ఇసుక డంపులు దర్శనమిస్తున్నాయి. ఇదేంటి అని ఎవరైనా ప్రశ్నిస్తే "అక్కడ ఫాంహౌస్ నిర్మాణం చేపడుతున్నామని, పశువులపాక ఏర్పాటు చేస్తున్నాం" అంటూ పొంతనలేని సమాధానాలు చెబుతుంటారు. ఇవే కాదు ఇలా అనేక కుంటిసాకులు చెబుతూ వ్యాపారులు తమ వ్యవసాయ పొలాల వద్ద వందలాది ట్రిప్పుల ఇసుకను స్టోర్ చేసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగా ఇసుకను డంప్ చేసుకుంటారు. మంచి ధర వచ్చినపుడు అక్కడి నుంచి తరలిస్తున్నారు. నంగునూరు పరిసర ప్రాంతాల్లో, నంగునూరు జూనియర్ కాలేజ్, నల్ల పోచమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో ఇసుక నిల్వలు కనపడుతున్నా అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వాగు పరివాహక రైతులు ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, అనుమతి లేకుండా పొలాల వద్ద డంప్ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు ఉపయోగపడే పనులకు తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నంగునూరులోని వ్యవసాయ బావుల వద్ద నిల్వ చేసిన ఇసుక డంపులు

కాజీపల్లి కాలుష్య సమస్యలపై అధికారులకు ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న కాజీపల్లి వాసులు

జిన్నారం, జూన్ 25: కాజీపల్లి పరిధిలో నెలకొన్న పరిశ్రమల కాలుష్య సమస్యపై గ్రామానికి చెందిన నాయకులు రమాకాంత్, కుమార్ ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీడీవో అరుణలకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కొన్ని పరిశ్రమలు నియంత్రన పాటించ కుండా వ్యర్థ జలాలను వదిలి వేస్తున్నాయని, వాయు కాలుష్యం కూడా అధికంగా ఉందని తెలిపారు. కాగా సమస్యను ఎంపీపీ రవీందర్‌గౌడ్ పీసీబీ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయమై గ్రామస్థుల సహకారం, జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వరకు వినతిపత్రాలు అందజేసి, తీరు మారకపోతే ఆందోళనలు, కోర్టులో కేసుల దాఖలు చేపడుతామని రామాకాంత్ తెలిపారు.

ట్రిపుల్‌ఆర్‌లో భూములను కోల్పోతున్న
రైతులకు పరిహారం చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోతులబోగుడ రైతులు

శివ్వంపేట, జూన్ 25: ట్రిపుల్‌ఆర్‌లో భూములను కోల్పోతున్న బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పోతులబోగుడ గ్రామానికి చెందిన 53 మంది రైతులు, తాజా మాజీ సర్పంచ్ హరికిషన్‌రావుతో కలిసి మంగళవారం శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయంలో ట్రిపుల్‌ఆర్ తహసీల్దార్లను కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పోతులబోగూడ గ్రామంలో 53 మందికి చెందిన 44 ఎకరాల భూమి రీజనల్ రింగ్‌రోడ్ నిర్మాణంలో కోల్పోతున్నట్టు తెలిపారు. సర్వే నెంబరు ప్రాతిపదికన కాకుండా భూములను కాస్తు చేసుకుంటున్న, ట్రిపుల్‌ఆర్‌లో భూములను కోల్పోతున్న చిన్న, సన్నకారు బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ట్రిపుల్‌ఆర్ తహసీల్దార్లు సోమేశ్వర్ కుమార్, సత్యనారాయణలను రైతులు కోరారు. అనంతరం మెదక్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దీన్, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



శ్రీరాం విఠవ్వ (ఫైల్)

కల్హేర్, జూన్ 25: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామానికి చెందిన శ్రీరాం విఠవ్వ(65) భర్త చనిపోయాడు. కుమారుడు వీఆర్‌వోగా దూర ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తుండడంతో మానసికంగా కుంగిపోయింది. దీంతో ఈనెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటిపక్క వారు గమనించి విఠవ్వను చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందిందని చెప్పారు. కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కల్హేర్ ఏఎస్‌ఐ అంజయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి వైర్లు చోరీ





గవ్వలపల్లితండా శివారులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్, తూప్రాన్‌లో కేబుల్ వైర్లు చోరీ జరగగా మిగిలిన స్టార్టర్లు

చిన్నశంకరంపేట, జూన్ 25: ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి వైర్లను చోరీకి పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి తండా శివారు కొయ్యమర్రి వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. జంగరాయి గ్రామానికి చెందిన రైతులు గవ్వలపల్లితండా శివారులో వ్యవసాయం చేస్తున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్లను దొంగలించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో బోరు మోటార్ల కేబుల్ వైర్ల చోరీ

తూప్రాన్, జూన్ 25: తూప్రాన్ పట్టణ పరిధిలో పెద్దచెరువు ఆయకట్టు బోరు మోటార్ల కేబుల్ వైర్లు సోమవారం రాత్రి చోరీకి గురయ్యారు. గుర్తు తెలియని దొంగలు పెద్దచెరువు కట్టకింద ఉన్న బోర్ల కేబుల్ వైర్లు కట్ చేసి చోరీ చేసుకెళ్లారు. సుమారు 15 మంది రైతులకు మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న సమయంలో బోరు వైర్ల కేబుల్ వైర్లు చోరీకి గురవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామాల్లోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలి



చిట్కుల్‌లో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి

చిలప్‌చెడ్, జూన్ 25: వర్షాకాలంలో రోగాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, గ్రామాల్లోని వీధులన్నీ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గల సెగ్రిగేషన్‌షెడ్, డంపింగ్‌యార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వాటిల్లో ఆయిల్‌బాల్స్ వేస్తుండాలని, పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, సెగ్రిగేషన్ షెడ్‌లో వర్మీ కంపోస్టు తయారు చేయాలని కార్మికులకు, కార్యదర్శికి సూచించారు. ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

డ్రమ్‌సీడర్‌తో రైతులకు లాభాలు

● మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీ



డ్రమ్ సీడర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వెల్దుర్తి, జూన్ 25: వరిసాగులో డ్రమ్ సీడర్‌తో రైతులకు లాభాలు వస్తాయని మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో డ్రమ్ సీడర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతి ద్వారా వరి సాగుకు ఎకరానికి 8 నుంచి 10 కిలోల వరి విత్తనాలు నాటుకునేందుకు సరిపోతాయని తెలిపారు. ఒకరోజు మూడు ఎకరాల వరకు విత్తనం వేసుకోవచ్చని సూచించారు. మొక్కకు మొక్కకు సరైన దూరం ఉంటుందన్నారు. డ్రమ్ సీడర్‌ను వాడడం వల్ల సమయం ఆదా అవుతుందని, ఖర్చు తగ్గుతుందని, అధిక దిగుబడి వస్తుందని సూచించారు.

రేపు అందోలులో భూ నిర్వాసితుల సమావేశం

పుల్‌కల్, జూన్ 25: చౌటకూర్ మండలంలోని ఐదు గ్రామాల శివారులో త్రిబుల్ ఆర్ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో 27న సమావేశం నిర్వహిస్తున్నట్లు అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాల్సిన పరిహారం విషయమై అందోలులోని నీటిపారుదలశాఖ అతిథి గృహంలో గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. పరిహారం విషయమై రైతులు తమ సందేహాలు, సలహాలు తెలియజేయాలని సూచించారు. మండలంలోని శివంపేట, వెండికోలు, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, కోర్పోలు గ్రామాల శివారులో భూములు కోల్పోతున్న రైతులు మాత్రమే ఈ సమావేశానికి హాజరుకావాలని అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు కోరారు.

పోలీ‌స్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో చోరీ

● గోడకు కన్నం వేసి కిరాణ షాప్‌లో దొంగతనం

● 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు అపహరణ



దొంగలు కన్నం వేసిన ప్రాంతాన్ని డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయిస్తున్న దృశ్యం

పాపన్నపేట, జూన్ 25: పోలీ‌స్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న కిరాణాషాపులో దొంగతనం జరిగింది. గోడకు కన్నంపెట్టిన దుండగులు బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదును దోచుకెళ్లిపోయారు. ఈ సంఘటన పాపన్నపేట మండల కేంద్రంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పాపన్నపేటకు చెందిన కూకుట్ల సత్యనారాయణ ప్రధాన రోడ్డు పక్కన రెండేళ్లుగా వీరభద్ర కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 9.30 గంటలకు రోజులాగే తన కుమారుడు దుర్గాప్రసాద్ దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచి లోపలికి వెళ్లాడు. కౌంటర్ వద్ద సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో అనుమానం వచ్చి పరిశీలించగా.. దుకాణం వెనక వైపు ఉన్న గోడకు కన్నం వేసి ఉన్నది. చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారమందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దుకాణానికి వెనుక వైపు ఉన్న గోడకు గునపంతో కన్నం వేశారు. ఆ కన్నం నుంచి లోపలికి ప్రవేశించి నగదు కౌంటర్‌ను ధ్వంసం చేసి.. అందులో ఉన్న సుమారు రూ.2 లక్షల నగదు, 12 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లిపోయారు. ఆధారాలు దొరకకుండా డీవీఆర్ బాక్సు, టీవీని కూడా ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం సిబ్బంది, జాగిలంతో ఆధారాలు సేకరిస్తున్నారు. పోలీ‌స్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో చోరీ జరగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముస్త్యాలలో మరో సైబర్ మోసం

● ఓ వ్యక్తి నుంచి రూ.80 వేలు హాంఫట్

చేర్యాల, జూన్ 25: సైబర్ మాయగాళ్ల ఉచ్చులోపడి చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి మరో వ్యక్తి రూ.80 వేలు పోగొట్టుకున్నాడు. రెండురోజుల క్రితం ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.13.50 లక్షలు కోల్పోయిన విషయం మరవకముందే అదే గ్రామానికి చెందిన యెనిశెట్టి అమర్‌నాథ్ రూ.80 వేలు కోల్పోయాడు. తన వాట్సప్‌కు వచ్చిన పీఎం కిసాన్ పీఎస్‌కే లింక్‌ను ఓపెన్ చేయడంతో అతడి బ్యాంకు ఖాతాలోంచి డబ్బులు మాయమాయ్యాయి. దీంతో ఆందోళనకు గురైన అమర్‌నాథ్ సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

సిద్దిపేట బాలాజీ బార్‌లో అగ్నిప్రమాదం

● సుమారు రూ.15 లక్షలు ఆస్తి నష్టం



ఎక్స్‌కవేటర్ సహాయంతో బార్ షెటర్‌ను పగులగొడుతున్న సిబ్బంది

సిద్దిపేట క్రైం, జూన్ 25: సిద్దిపేట పట్టణంలోని బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్‌లో కౌంటర్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం ఉదయం మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగిసిపడుతుండడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా.. అదుపులోకి రాలేదు. దీంతో ఎక్స్‌కవేటర్ సహాయంతో షట్టర్‌ను పగులగొట్టి.. తర్వాత ఫైరింజన్ సాయంతో మంటలను ఆర్పేశారు. అప్పటికే బార్‌లో ఉన్న విస్కీ బాటిళ్లు, కబోర్డ్స్, కౌంటర్‌లో ఉన్న డబ్బులు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ సమయంలో బార్‌లో ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు మల్లారెడ్డి తెలిపారు.

అమ్మో.. ఎంత పెద్ద పామో..!



నాగుపామును పట్టుకున్న దృశ్యం

చేగుంట, జూన్ 24: చేగుంట మండలం అనంతసాగర్ గ్రామ శివారు నల్లకుంట సమీపంలోని వ్యవసాయ పొలంలో ఓ భారీ నాగుపామును పట్టుకున్నారు. గ్రామానికి చెందిన రైతు పెండ్యాల శంకర్ పొలంలో భారీ నాగుపాము కనిపించింది. పాములు పట్టే నైపుణ్యం కలిగిన చేగుంట గ్రామానికి చెందిన ఎర్ర నాగులుకు సమాచారమందించారు. అతను వచ్చి పొలంలో సంచరిస్తున్న ఎనిమిది అడుగుల భారీ నాగుపామును పట్టుకుని, సమీప అడవిలో వదిలేశాడు. ఇంత పెద్ద నాగుపామును చూడడం ఇదే మొదటిసారి అని స్థానికులతో పాటు చుట్టుపక్కలవారు తెలిపారు.

27న భవిష్యనిధి సమస్యలపై శిబిరాలు

● పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు, జూన్ 25: భవిష్యనిధి (ప్రావిడెంట్ ఫండ్) ఖాతాదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ఈ నెల 27న మూడు వేర్వేరు ప్రాంతాల్లో మెగా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని పటాన్‌చెరు భవిష్యనిధి ప్రాంతీయ కమిషనర్ విశాల్‌అగర్వాల్ తెలిపారు. చందానగర్ హైహోంజ్యువల్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో, పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఆల్కా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో, సదాశివపేట మండలం చందాపూర్ గ్రామంలోని పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమలో సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9-30 నుంచి సాయంత్రం 5-45వరకు శిబిరాల్లో ఖాతాదారుల ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

డ్రిప్ స్ప్రింక్లర్లపై రైతులకు సబ్సిడీ

● మెదక్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య

మాసాయిపేట, జూన్ 25: జిల్లాలో ఆయిల్ పామ్ పండ్ల తోటలు, కూరగాయ తదితర పంటలు పండించే సన్న చిన్న కారు ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీని అందజేస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమల శాఖ అధికారి డి నర్సయ్య వెల్లడించినట్లు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాలతో మీసేవ కేంద్రాల్లో ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి రజిత తెలిపారు.



శివంపేట శివారు వీర హనుమాన్ ఆలయం వద్ద ఏర్పడిన భారీ గుంతలు



శివంపేట క్రీడా ప్రాంగణంలో మట్టిని ట్రాక్టర్ల ద్వారా డంప్ చేస్తున్న దృశ్యం



శివంపేటలో నిల్వ చేసిన మట్టి కుప్పలు

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

శివంపేటలో యథేచ్ఛగా దందా

● ప్రైవేట్ వెంచర్లకు విచ్చలవిడిగా తరలింపు

● రూ.లక్షలు గడిస్తున్న దళారులు

● చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

● కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు

పుల్‌కల్, జూన్ 25: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో మట్టి మాఫియా దందా జోరుగా సాగుతున్నది. రెవెన్యూ, పోలీసు అధికారుల అండదండలతో మట్టి అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. శివంపేట గ్రామానికి ఆనుకుని సహజ సిద్ధంగా భారీ ఎత్తైన కొండలు, గుట్టలు ఉన్నాయి. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారికి ఆనుకుని శివంపేట నుంచి చౌటకూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రైవేట్ వెంచర్లు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఆ వెంచర్లలో అంతర్గత రహదారుల ఏర్పాటుకు అవసరమైన ఎర్ర మట్టిని రాత్రీ, పగలు తేడా లేకుండా అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. స్థానికులెవరైనా అడ్డుకునేందుకు యత్నిస్తే తాము రెవెన్యూ, పోలీసు అధికారులకు నెలనెలా మామూళ్లు అందజేస్తున్నామని బుకాయిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

శివంపేట గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ కార్యకర్తలు నిబంధనలకు విరుద్ధంగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మట్టి తరలింపునకు అనుమతులు తీసుకోకపోయినప్పటికీ, తాము అధికార పార్టీ కార్యకర్తలమన్న ధీమాతో రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్‌తో భారీ టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. గ్రామ శివారులోని కంకర మిషన్ ప్రాంతం, వీరహనుమాన్ ఆలయ ప్రాంతంలో ఉన్న గుట్టలు, కొండలను పూర్తిగా తవ్వేస్తున్నారు. ఇదేమి దందా అని ఎవరైనా స్థానికులు అడ్డుకుంటే వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దాడులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మట్టి అక్రమ దందా కోసం ప్రత్యేకంగా ఎక్స్‌కవేటర్లు, భారీ టిప్పర్లు, ట్రాక్టర్లను కొనుగోలు చేసుకుని మరీ వ్యాపారం చేస్తున్నారు. కొండలు, గుట్టల నుంచి తవ్విన మట్టిని తమకు అనువైన ప్రదేశంతో పాటు గ్రామ శివారులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన క్రీడా ప్రాంగణంలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి అవసరమైన వారికి, ప్రైవేట్ వెంచర్లకు, సంగారెడ్డి నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట తదితర ప్రాంతాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు, ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు తీసుకుంటున్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్నారంటూ స్థానికులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా తమ గురించి ఎవరికి చెప్పినా భయపడేది లేదని, ప్రతినెలా రెవెన్యూ, పోలీసు ఇతర అధికారులకు మామూళ్లు ముట్టజెప్పుతున్నామని మట్టి మాఫియా నిర్వాహకులు చెప్పడం విస్మయం కలిగిస్తున్నది. ఈ విషయమై తహసీల్దార్ ఈశ్వరీరాణిని సంప్రదించగా ప్రతీరోజు భూముల రిజిస్ట్రేషన్లు ఇతరత్రా పని ఒత్తిడి కారణంగా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తనకు సమాచారం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రకృతి ప్రసాదించిన కొండలు, గుట్టలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎక్స్‌కవేటర్‌తో మట్టిని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం



మట్టిని తరలిస్తున్న టిప్పర్

మట్టి మాఫియాను అడ్డుకోవాలి



శివంపేట గ్రామ శివారులో మట్టి మాఫియా తరలింపును అడ్డుకోవాలి. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అదేపనిగా మట్టి దందా చేస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గ్రామ శివారులో ఎక్కడచూసినా డంప్ చేసిన మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి మట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.

- ఎండీ అలీం, ఎంపీపీ కో ఆప్షన్ సభ్యుడు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభానికి చర్యలు

● రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

మెదక్ అర్బన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 25: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 5 నుంచి 6 ఏళ్లుగా పిల్లల సంక్షేమం కోసం కృషి చేసిన ప్రముఖమైన స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కార్యాచరణ, పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి సెంటర్‌లో తాగునీరు, అవసరమైన మేర టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు మొదలగు పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామ, పట్టణాల్లో ఉన్న 1 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలను కేంద్రాల్లో రిజిస్టర్ చేయించి, వారికి రెగ్యులర్‌గా పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మెదక్ జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, సిద్దిపేట జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులకు మంచి అవకాశం

● సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



అడ్మిషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 25: రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. మంగళవారం ఆయా పాఠశాలలకు సంబంధించిన అడ్మిషన్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మూడు పాఠశాలల్లో బాలురకు 60 సీట్లు, బాలికలకు 60 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థుల ఎంపిక మూడుదశల్లో ఉంటుందని తెలిపారు. మొదటి దశలో మండలస్థాయి ఎంపిక ఈ నెల 21 నుంచి 25 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహిస్తామన్నారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రెండో దశలో ఈనెల 29న జిల్లాస్థాయి ఎంపిక జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 8.30 గంటల నుంచి జరుగుతుందని చెప్పారు. ఇందులో 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసి జూలై 8వ తేదీ నుంచి 12 వరకు హకీంపేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక టెస్టుకు పంపిస్తారని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నాగేందర్, తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.హరిబాబు సమీకృత జిల్లా కార్యాలయంలోని కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మద్యం ప్రియులకు అడ్డాగా కేజీబీవీ



అల్లాదుర్గంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ కళాశాల భవనం



భవనంలోని ఓ గదిలో దర్శనమిస్తున్న మద్యం బాటిళ్లు (వృత్తంలో)

అల్లాదుర్గం, జూన్ 25: బడులు గుడిలతో సమానమంటారు. అలాంటి భవనాలనే మద్యం ప్రియులు అడ్డాగా మార్చారు. ఇదేం పని అని ప్రశ్నిస్తే.. భవన నిర్మాణ కార్మికులని, రాత్రివేళలో సేవిస్తున్నారని పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది సెలవిస్తున్నారు. అల్లాదుర్గంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి సంబంధించిన కళాశాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ భవనం కొంతకాలంగా మద్యం ప్రియులకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలల సెలవు కదా.. అని స్థానికులు పట్టించుకోలేదు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. అయితే ఈ భవనానికి సమీపంలో ఎస్సీ బాలుర వసతి గృహం, కేజీబీవీ ఉన్నాయి. మద్యం ప్రియులు మద్యం మత్తులో విద్యార్థులపై ఏదైనా అఘాయిత్యం చేస్తే ఎవరు బాధ్యులని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్గల్ విద్యాధరిలో శ్రావణ నక్షత్ర పూజలు

● వైభవంగా వేంకటేశ్వరస్వామికి విశేష పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

వర్గల్, జూన్ 25: వర్గల్ విద్యధరి క్షేత్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రావణ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు, విశేష పూజలతో పాటు లక్ష తులసి పూజ నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. అనంతరం భక్తులు క్షేత్రంలోని విద్యా సరస్వతీ, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ మహా అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

ఖమ్మంపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు స్వాధీనం



ఇళ్లలోని సామాను బయటపెట్టిస్తున్న అధికారులు

కొండపాక, జూన్ 25: కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనధికారికంగా ఉంటున్న వారిని ఖాళీ చేయించి అధికారులు ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో 60 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. ఇందులో 41 ఇళ్లను అర్హులకు కేటాయించారు రెండో జాబితాలో 19 ఇళ్లను తర్వాత పంపిణీ చేస్తామని అనుకున్నారు. కానీ చేయకపోవడంతో అవి అలాగే ఉండిపోయాయి. ఎవరికీ కేటాయించని ఇళ్లలో గ్రామానికి చెందిన పలువురు నివాసముంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో నోటీజులు అందజేశారు. ఖాళీ చేయమని చెప్పినా చేయకపోవడంతో మంగళవారం తహసీల్దార్ దిలీప్‌నాయక్ ఆధ్వర్యంలో త్రీ టౌన్ పోలీసుల సహకారంతో ఇళ్లల్లో అక్రమంగా ఉంటున్న వారి ఇళ్ల తాళాలు పగులగొట్టి సామాను బయటపెట్టారు. అనంతరం తాళాలు వేసి ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 25: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి 1,534 దరఖాస్తులు స్టేజ్‌ల వారీగా త్వరితగతిన ప్రణాళికాబద్ధంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ గుల్షన్‌సింగ్, జిల్లా పరిశ్రమశాఖ మేనేజర్ కృష్ణమూర్తి, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు మెప్మా పీడీ ఇందిరా, ఎస్సీ ఎస్టీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, బీసీ అధికారి నాగరాజ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అందరికీ న్యాయం చేస్తాం

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 25: నామినేటెడ్ పదవుల్లో అందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి భరోసానిచ్చారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల విషయంలో జరుగుతున్న అన్యాయం గురించి వారి దృష్టికి తీసుకెళ్లారు. వారు చెప్పిన విషయాలను విన్న వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని హామీఇచ్చారని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై ఆరా తీస్తామని, నామినేటెడ్ పదవుల్లో అందరికీ న్యాయం జరిగేలా చూడడంతో పాటు గజ్వేల్ పరిణామాలపై రిపోర్టును సేకరించి, అధిష్టానానికి నివేదిస్తామని తెలిపినట్లు తెలిసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అందరికీ సమ న్యాయం చేస్తామని పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తామన్నారు. నామినేటెడ్ పదవుల్లో అందరికీ సమ ప్రాధాన్యత దక్కేలా చూస్తామని హామీఇచ్చినట్లు తెలిసింది. దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో ఫోన్లో మాట్లాడిన శ్రీకాంత్ రావు, మల్లారెడ్డిలు పార్టీలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలిపారు. అందరినీ కలుపుకుపోతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు అన్నివిధాలుగా అధిష్టానం అండగా ఉంటుందని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించేలా చూసుకుంటామని హామీఇచ్చారు. వారితో టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, న్యాయవాది గోపాలరావు, కాంగ్రెస్ గజ్వేల్ మండలాధ్యక్షుడు బయ్యారం మల్లారెడ్డి, కాంగ్రెస్ ములుగు మండలాధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్, తీగుల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, ఛాట్లపల్లి మాజీ ఎంపీటీసీ నర్సింహులు, నాయకులు ఉన్నారు.

గ్రామపంచాయతీల నిర్వహణ కష్టంగా మారింది



ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్యదర్శులు

మిరుదొడ్డి, జూన్ 25: గ్రామపంచాయతీల నిర్వహణ కష్టంగా మారిందని మిరుదొడ్డి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఫహీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మిరుదొడ్డి మండలంలోని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులతో కలిసి గ్రామపంచాయతీలకు నిధులను మంజూరీ చేయాలని ఎంపీడీవో గణేష్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొన్నినెలలుగా గ్రామపంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు(ఎస్ఎఫ్‌సీ), కేంద్ర ఆర్థిక సంఘం 15వ ఫైనాన్స్ నిధులు జమకాకపోవడంతో గ్రామపంచాయతీల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు జీతాలు, డీజిల్ చార్జీలు, ట్రాక్టర్ నిర్వహణ, కరెంట్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారిందన్నారు. ఇతర పనులకు అప్పులుచేసి తాము బిల్లులను చెల్లించామని తెలిపారు. దీనివల్ల తాము మానసిక ఆవేదనకు గురవుతున్నామని స్పష్టం చేశారు. అధికారులు స్పందించి గ్రామపంచాయతీలకు నిధులను మంజూరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, మమత, రవీందర్, అశోక్, యాదగిరి, ఉషా, వంశీ, మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

● అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో పోలీస్ అధికారులు
● విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సిద్దిపేట రూరల్, జూన్ 25: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి సూచించారు. సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇర్కోడు ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● తొగుట: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తొగుట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, నివారణ మార్గాలపైన తొగుట పోలీసులు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

● దౌల్తాబాద్: యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచణ, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రుల పాత్ర ప్రధానమని పిల్లలకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సాయిలు, కానిస్టేబుల్ పరుశురాం పాల్గొన్నారు.


మర్కుక్: కస్తూర్బాగాంధీ పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్ఐ మధుకర్‌రెడ్డి


సిద్దిపేట రూరల్: వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి

● చేర్యాల: మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చేర్యాల ఎస్ఐ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో సాంఘీక, సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కొమురవెల్లి పోలీసుల ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏఎస్ఐ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

● మర్కుక్: బాల్యంలో నేర్చుకున్న విద్యాబుద్ధులే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అదిరోహించడానికి పునాదని, విద్యార్థులు ఇష్టంతో చదవాలని మర్కుక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని విద్యార్థినులకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు, డ్రైవింగ్ ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థినులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని ఉన్నత చదువుల వైపు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మద్దూరు: అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ జగదీశ్వర్ మాట్లాడారు. విద్యార్థులకు మాదవద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేయనున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

● నంగునూరు: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని రాజగోపాలపేట ఎస్ఐ భాస్కర్ రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా దినోత్సవం సందర్భంగా నంగునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామస్వామి గౌడ్, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, జి.తిరుపతి, కన్యాలల్, హెడ్ కానిస్టేబుల్ యాదవరెడ్డి, కానిస్టేబుల్ శంకర్,పాల్గొన్నారు.


చేర్యాల: గురుకుల పాఠశాలలో వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ దామోదర్

● సిద్దిపేట అర్బన్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి రెసిడెన్షియల్ స్కూల్, ఎన్సాన్‌పల్లి రెసిడెన్షియల్ స్కూల్, వికాస్ హై స్కూల్ విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి నివారణ మార్గాలపైన వ్యాసరచన పోటీలు, డ్రైవింగ్ ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


దౌల్తాబాద్: బాలుర జడ్పీ పాఠశాలలో వ్యాసరచణ పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ

చాడ పరామర్శ

హుస్నాబాద్, జూన్ 25: హుస్నాబాద్ పట్టణానికి చెందిన మొదటితరం వైద్యులు బొద్దున రంగయ్య, పూదరి వజ్రవ్వలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేష్, నాయకులు సంజీవరెడ్డి, సుదర్శనచారి గూడ పద్మ, జనగామ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి..

రాయపోల్, జూన్ 25: రాయపోల్ తాజా మాజీ సర్పంచ్ మౌనిక తాత ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకరరెడ్డి మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జడ్పీటీసీ యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, నాయకులు రాజిరెడ్డి, బాగారెడ్డి, కల్లూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

గజ్వేల్, జూన్ 25: మండలంలోని మక్తమాసాన్‌పల్లి మదిర గ్రామమైన అహ్మద్‌నగర్‌లో తండ్రి, కూతురు మృతిచెందిన విషయం తెలుసుకున్న గజ్వేల్ బీఆర్ఎస్ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయనవెంట తాజా మాజీ సర్పంచ్ రజిత వెంకటేశ్, మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్, మోహీన్, మజ్జు, మునీర్, యాదగిరి తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నకోడూరు, జూన్ 25: మండలంలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏంఏ ఇంగ్లిష్‌తో పాటు, బీఈడీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 28 వరకు పాఠశాలలో సమర్పించాలని సూచించారు.

మద్దూరు ఎస్ఐ బదిలీ

మద్దూరు, జూన్ 25: మద్దూరు మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ బదిలీ అయ్యారు. ఈ మేరకు సిద్దిపేట సీపీ అనురాద ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని మద్దూరు నుంచి కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్తున్నారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

నంగునూరు,జూన్ 25: నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న పాలీసెట్ కౌన్సెలింగ్ మంగళవారం ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. చివరి రోజు 87 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేశామన్నారు. ఇప్పటి వరకు మొత్తం 816 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నంగునూరు,జూన్ 25: మండలంలోని కోనాయిపల్లిలో మంగళవారం రాత్రి పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి 8 మందిని అరెస్టు చేసి కారు, స్కూటీ, ఆటోతో పాటు ఐదు బైకులు, 8 సెల్ ఫోన్లు, రూ. 7880 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. గ్రామ శివారులోని నిమ్మ బాపురెడ్డి పశువుల కొట్టం వద్ద పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి, పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్లు చెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● సీహెచ్‌వో జాకీర్ హుస్సేన్


సిద్దిపేట రూరల్: రమ్ములో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేస్తున్న సీహెచ్‌వో జాకీర్ హుస్సేన్

సిద్దిపేట రూరల్/గజ్వేల్, జూన్ 25: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చింతమడక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీహెచ్‌వో జాకీర్ హుస్సేన్ సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో మంగళవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి వద్ద, పరిసరాల్లో పాత కుండలు, తాగేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు ఉంటే తొలగించాలని చెప్పారు. వాటిలో వర్షం నీరు నిలిచి దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సుజాత, ఆశావర్కర్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ సిబ్బంది కోరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డులోని బీసీ కాలనీలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం దోమల మందును పిచికారి చేయించారు. వైద్య సిబ్బంది దేవసాని వాసుదేవ్, నాగరాజు, హెల్త్ అసిస్టెంట్స్ ఎస్.రమేశ్, ఫీల్డ్‌వర్కర్ రాణి సుల్తానా తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

చేర్యాల, జూన్ 25: రూ.2లక్షల పంట రుణమాఫీ ప్రకటన పట్ల హర్షంవ్యక్తం చేస్తూ చేర్యాల పట్టణంలోని పాతబస్టాండు వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ లక్ష రుణమాఫీనే దశలవారీగా కూడా అమలుచేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే సబ్బండ వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముస్త్యాల తార, ఆడెపు నరేందర్, తుమ్మలపల్లి లీల, నాయకులు ఐత శ్రీనివాస్, ఆడెపు చంద్రయ్య, పుర్మ ఆగంరెడ్డి, తడక లింగం, తుమ్మలపల్లి సంజీవులు, దాసరి శ్రీకాంత్, జహురుదీన్, సనాది భాస్కర్, నాగుల వెంకటేశం, బుడిగె రమేశ్, మామిడాల నాగరాజు, నీలం చింటు పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి క్రీడా పోటీలు

గజ్వేల్, జూన్ 25: క్రీడా పాఠశాలలో ఎంపికకు ప్రజ్ఞాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సునీత తెలిపారు. గజ్వేల్‌లో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ప్రజ్ఞాపూర్ పాఠశాలలో ఉదయం 10గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని, సెప్టెంబరు 1, 2015 నుంచి 31 ఆగస్టు 2016 మధ్య జన్మించి నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ బోనాఫైడ్, 3 పాస్‌ఫొటోలతో జడ్పీహెచ్ఎస్ ప్రజ్ఞాపూర్ పాఠశాలలో హాజరుకావాలన్నారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9603783280 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వారితో పీడీలు భవాణీ, రవికుమార్, విజయరేఖ, నాగేశ్ ఉన్నారు.

అందెలో కనువిప్పు కార్యక్రమం

మిరుదొడ్డి,జూన్25: మండలంలోని అందె గ్రామంలో కళాబృందం కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ పరుశురాములు మాట్లాడారు. మూఢనమ్మకాల నిర్మూలనపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు

● ఆరు గ్యారంటీలు అమలు చేశాం
● రుణమాఫీ కూడా అమలు చేస్తాం
● సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట క్రైం, జూన్ 25: కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. సిద్దిపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు 6 గ్యారంటీలను అమలు చేసి చూపించిందని అన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేసి చూపిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇచ్చిన మాటకు కట్టుబడి రాజీనామా చేయాలన్నారు. లేకుంటే మీరు చేస్తున్న డ్రామాలు అన్ని ప్రజలు గమనిస్తున్నారని, వారే తగిన బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. సుడాలో అక్రమాలు జరుగుతున్నాయని తమకు సమాచారం వస్తే బాధ్యతగా తీసుకుని అడ్డుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, కాంగ్రెస్ సిద్దిపేట యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్, నజ్జు అనిల్, రాజేష్ పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుచేసుకోవచ్చు

● తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి ఎస్. శ్రీదేవి

సిద్దిపేట రూరల్, జూన్25: యాంత్రీకరణ పద్ధతిలో అధిక సాంద్రత ప్రత్తిసాగు చేసుకోవచ్చునని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి ఎస్. శ్రీదేవి పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాలలో వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రంలో మంగళవారం యాంత్రిక పద్ధతిలో పత్తి నాటడంపై దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో 1 లక్ష 08 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని, సాధారణ పద్ధతిలో మొక్క అధికంగా పెరగడం, పంట కాలం ఎక్కువగా ఉండి గులాబి రంగు పురుగు ఉధృతి పెరిగితే దానిని నివారించడం కష్టంగా మారిందన్నారు. అంతేకాకుండా కూలీల కొరతతో సాగు ఖర్చు అధికమవుతుందన్నారు. యాంత్రీకరణ పద్ధతిలో వరుసల మధ్య దూరం 90 సెం.మీ. మొక్కల మధ్య 20 సెం. మీల దూరం ఉంటుందన్నారు. సాధారణ పద్ధతిలో సుమారుగా ఒక ఎకరం వేయడానికి 4 నుంచి 6 మంది కూలీలు, 2 నుంచి 3 ప్యాకెట్ల విత్తనాలు అవసరమవుతాయని, కానీ యాంత్రీకరణ పద్ధతిలో అరగంటలో వేయవచ్చునని, అందుకు 5నుంచి 6 ప్యాకెట్ల విత్తనాలు అవసరమవుతాయన్నారు. అనంతరం ఏరువాక కోఆర్డినేటర్ విజయ్ మాట్లాడుతూ.. యాంత్రికరణ పద్ధతిని రెండు సంవత్సరాలుగా వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పల్లవి, శ్రీజయ, ఉమారాణి, శ్వేత, సరిత తదితరులు పాల్గొన్నారు.


యాంత్రీకరణ పద్ధతిపై అవగహన కల్పిస్తున్న దృశ్యం

పంటల సాగుపై అవగాహన


వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయాధికారులు

మర్కుక్, జూన్ 25: వానాకాలంలో వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మర్కుక్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అందించే రైతు భరోసా, ఆర్థిక సహాయంపై రైతుల అభిప్రాయాలను రాతపూర్వకంగా సేకరించి రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అనిల్‌కుమార్, మండల వ్యవసాయ అధికారులు టి. నాగేందర్‌రెడ్డి, వసంతరావు, శేష శయన, ప్రగతి, ములుగు వ్యవసాయ డివిజన్‌కు చెందిన రైతులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

సిద్దిపేట అర్బన్, జూన్ 25: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. సిద్దిపేటలో సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ వర్కర్ విధానంతో జిల్లాలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నదని ఆరోపించారు. ట్రాక్టర్ నిర్వహణలో, ఎలక్ట్రిషన్ నిర్వహణలో మరణాలు సంభవిస్తున్నా ప్రమాద బీమా సౌకర్యం లేదని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మహేష్, సీఐటీయూ జిల్లా సహాయ చొప్పరి రవికుమార్, నాయకులు కనకయ్య, యూనియన్ నాయకులు శంకర్, రాజనర్సు, మల్లయ్య, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భగీరథ నల్లాలపై ముగిసిన సర్వే

● మండల వ్యాప్తంగా 5362 కనెక్షన్లు
● యాప్‌లో వివరాలు నమోదు
● కొత్త ఇళ్లకు త్వరలో నల్లాలు


ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న అధికారులు

నారాయణరావుపేట, జూన్ 25: రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి నల్లా కనెక్షన్లపై చేపట్టిన సర్వే ముగిసింది. మండలంలో పది గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ పథకం కింద 5362 నల్లా కనెక్షన్లు ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. అదేవిధంగా నూతనంగా నిర్మాణం చేపడుతున్న గృహాలకు మిషన్ భగీరథ కింద మరిన్ని కనెక్షన్లు అవసరం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. గత ప్రభుత్వం తాగునీటి సరఫరా లేని ఇళ్లు, తాగు నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నాడు మిషన్ భగీరథకు శ్రీకారం చుట్టింది. మండలంలో ఇప్పటి వరకు ఉన్న మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ల ద్వారా ఇంటింటికి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. నల్ల ద్వారా తాగు నీరు సరిగా సరఫరా అవుతుందా? లేదా అనే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా సర్వే చేపట్టింది.

యాప్‌లో సర్వే వివరాలు

ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ఇంటింటి సర్వేలో సిబ్బంది ఇంటి యజమానిని క్షుణ్ణంగా వివరాలు అడిగి యాప్‌లో నమోదు చేశారు. సర్వేలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా, నీళ్లు వస్తున్నాయా, ఎన్ని రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయి, ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులకు సరిపడా నీళ్లు వస్తున్నాయా, ఒకవేళ నల్లా నీళ్లు రాకుంటే ఎప్పటి నుంచి రావడంలేదు వంటి తదితర వివరాలను అడిగి తెలుసుకుని యాప్‌లో ఇంటి యజమాని ఫొటో, ఆధార్, ఫోన్ నెంబర్లు, నల్లా ఫొటో సేకరించి నమోదు చేస్తున్నారు.

కేంద్రం నుంచి నిధుల సేకరణకు అనుకూలం

మిషన్ భగీరథ ఇంటింటి సర్వే వల్ల మరో ప్రయోజనం కూడా చేకూరనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్ కింద నిధులు సమకూర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేస్తున్నట్లు తెలుస్తున్నది. గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వే చేపట్టడం వల్ల నీటి వినియోగం ఎంత మేరకు అవసరం ఉంటుందనే అంచనాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

కొత్త కనెక్షన్లకు అవకాశం



మిషన్ భగీరథ సర్వే వల్ల పాత కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి. కొత్తగా మరెన్ని అవసరపడుతాయనేది ఈ సర్వే ద్వారా స్పష్టమవుతుంది. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. కొత్తగా ఎన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. వాటికి ఇచ్చే నల్లా కనెక్షన్ల వివరాలు క్షేత్రస్థాయిలో స్పష్టత వస్తుంది. అధికారుల ఆదేశాల మేరకు కొత్త కనెక్షన్లు ఇచ్చే అవకాశం ఉంటుంది.

- శ్రీరాములు, ఎంపీడీవో, నారాయణరావుపేట

శ్రీగిరిపల్లిలో మహిళ అదృశ్యం

గజ్వేల్, జూన్ 25: గజ్వేల్ మండల శ్రీగిరిపల్లి గ్రామంలో మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన దొబ్బల మహేశ్ మంగళవారం పని నిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. రోజు ఇంట్లో ఉండే ఆయన తల్లి దొబ్బల ఎల్లవ్వ(55) ఇంట్లో కనిపించలేదు. ఈ విషయమై చుట్టు పక్కల అంతటా వెతికిన మహేశ్ ఎల్లవ్వ ఆచూకీ లభించకపోవడంతో గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు.

ఇసుక డంపు స్వాధీనం


ఇసుక డంప్ పరిశీలిస్తున్న పోలీసులు

దూళిమిట్ట, జూన్ 25: మండలంలోని జాలపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ, నిల్వ చేసిన ఇసుక డంపును మంగళవారం చేర్యాల సీఐ ఎల్.శ్రీను, మద్దూర్ పోలీసు సిబ్బంది, దూళిమిట్ట రెవెన్యూ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను తదుపరి చర్యల నిమిత్తం ధూళిమిట్ట తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చేర్యాల సర్కిల్ పరిధిలో ఏవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలించినా, డంపు చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మద్దూర్ పోలీసు సిబ్బంది, దూళిమిట్ట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత

దౌల్తాబాద్, జూన్ 25: నిషేధిత గుట్కా ప్యాకెట్లను దౌల్తాబాద్ పోలీసులు, సిద్దిపేట జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు పట్టుకున్నారు. ఈ సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన నాగమల్లి భాస్కర్, లక్ష్మీనర్సింహ దుకాణంలో దౌల్తాబాద్ ఏఎస్ఐ సాయిలు, టాస్క్‌ఫోర్స్ పోలీస్‌ల ఆధ్వర్యంలో తనిఖీ చేయగా ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు సుమారు రూ.11 వేల 275 విలువ చేసే వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

దుబ్బాక, జూన్ 25: ద్విచక్రవాహనాల దొంగను దుబ్బాక పోలీసులు అరెస్ట్ చేశారు. దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్ సంఘటనకు సంబంధించి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామక్కపేటకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి కొద్ది రోజుల నుంచి ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నాడని తెలిపారు. ఈనెల 21న దుబ్బాకలోని శ్రీసాయి సమర్థ ఆశ్రమం వద్ద ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడని, ఆశ్రమం వద్ద ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా అతడిని పట్టుకుని విచారించినట్లు చెప్పారు. తాను పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను ఎత్తికెళ్లినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి నుంచి ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ గంగరాజు, కానిస్టేబుళ్లు తదితరులున్నారు.

ముత్యాల తలంబ్రాలు అందుకున్న మర్కుక్ ఎస్ఐ


ఎస్ఐకి ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న రామ కోటి రామరాజు

మర్కుక్, జూన్ 25: భద్రాచల దేవస్థాన కల్యాణ ముత్యాల తలంబ్రాలను శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షుడు రామకోటి రామరాజు మంగళవారం మర్కుక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డికి, పోలీస్ బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ.. భద్రాచలం ముత్యాల తలంబ్రాలు అందుకోవడం తాము అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం రామకోటి రామరాజును శాలువా కప్పి సన్మానించారు.

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు తరలిరావాలి

చేర్యాల, జూన్ 25: తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని, జూలై 4వ తేదీన జనగామ జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన ఆయన విగ్రహావిష్కరణకు కురుమలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆ సంఘం జనగామ పట్టణ గౌరవాధ్యక్షుడు మోటె శ్రీశైలం కోరారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని బీరప్ప ఆలయ ఆవరణలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జూకంటి శ్రీశైలం, దయ్యాల శ్రీనివాస్, వైకుంఠం, కర్రె రాములు, శవల్ల రాజయ్య, అందె బీరయ్య, అందె నానిబాబు, కామల్ల అనిల్, ఈరు భూమయ్య పాల్గొన్నారు.

ఏబీవీపీ సిద్దిపేట నగర కమిటీ ఎన్నిక

సిద్దిపేట క్రైం, జూన్ 25: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేట శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేసి నూతన నగర కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్దిపేట సంఘటన మంత్రి లక్ష్మీపతి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ బీరకాయల వివేక్‌వర్ధన్ నూతన నగర కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన నగర కార్యదర్శిగా గుగులోత్ పరశురాం, నగర సంయుక్త కార్యదర్శులుగా రాకేష్, మారుతి, ఉపాధ్యక్షులుగా నందు, ఫణిందర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా అనీష్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా అభిరామ్ లను ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సావుల ఆదిత్య పవన్, విభాగ్ సోషల్ మీడియా సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అధికార ప్రతినిధుల నియామకం

హుస్నాబాద్, జూన్ 25: బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ నియమించారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ఐలేని మల్లికార్జున్‌రెడ్డిలను అధికార ప్రతినిధులుగా నియమించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని

హుస్నాబాద్ జూన్ 25: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని సూచించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలో విస్తరిస్తున్న మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ కన్నోజు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాగిత నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

గజ్వేల్ పట్టణంలో నార్కోటిక్ డాగ్స్ తనిఖీలు

గజ్వేల్, జూన్ 25: గజ్వేల్ పట్టణంతో పాటు పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీగిరిపల్లి, కొల్గూరు, పాండవుల చెరువు ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. త్వరలోనే పోలీస్‌స్టేషన్ పరిధిలో మరికొన్ని బ్లాక్ స్పాట్స్‌లలో తనిఖీలు చేపడుతామని, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సమూలంగా నిర్మూలించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ రవాణా చేసినట్లయితే వెంటనే డయల్-100కు సమాచారం అందించాలన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, జూన్ 25: భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కాటం మల్లేశం, మాజీ సర్పంచు కొండపాక బిక్షపతి తదితరులు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరివెంట ఎండీ. ఖాజా, తాటిపాముల పరుశురాములు, వెలుగల రాజు, ఖలీల్, పాషా, నర్సింహులు ఉన్నారు.

అనంతరావుపల్లిలో సోషల్ ఆడిట్‌పై ర్యాలీ

గజ్వేల్, జూన్ 25: గజ్వేల్ మండలం అనంతరావుపల్లిలో ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్‌లో భాగంగా కూలీలు ర్యాలీ నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2024వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై ఎస్ఆర్‌పీ జీవన్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీల హక్కులపై అవగాహన కల్పించారు. ఉపాధిహామీ పనిలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయో అని తెలుసుకోవడానికి ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. వారితో బ్లాక్ రీసోర్స్ పర్సన్ సింహాద్రి, కరుణాకర్, పూజిత, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఈజీఎస్ సిబ్బంది శ్రీకాంత్, రజనీకాంత్, స్వామి, యాదగిరి, కిష్టయ్య తదితరులున్నారు.